క్లుప్తంగా

సన్మానం



యశోధరను సన్మానిస్తున్న స్పెషల్ ఆఫీసర్లు

మంచిర్యాలఅర్బన్: నూతనంగా బాధ్యతలు చేపట్టిన కేజీబీవీ సెక్టోరల్ అధికారి యశోధరను శుక్రవారం స్పెషల్ ఆఫీసర్లు శాలువాలతో సన్మానించారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని డీఈవో యాదయ్యను మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కేజీబీవీ సమస్యలను డీఈవో దృష్టికి తీసుకురాగా సానుకూలత వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చెన్నూర్, భీమారం, జైపూర్, వేమనపల్లి, నస్పూర్, హాజీపూర్ స్పెషల్ ఆఫీసర్లు ఎ.సుమలత, ఫణిబాల, కనకలక్ష్మి, మయూరి, మౌనిక, స్వప్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వినోద్‌ను కలిసిన జీఎం



ఎమ్మెల్యేకు పూలమొక్క అందిస్తున్న జీఎం

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను శుక్రవారం మందమర్రి ఏరియా జీఎం ఎ.మనోహర్ మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని బెల్లంపల్లిలో ఉన్న ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సాయిబాబా ఆలయకమిటీ సభ్యుల సన్మానం..

ఎమ్మెల్యే వినోద్‌ను బెల్లంపల్లిలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి సత్కరించారు. షిర్డీ సాయిబాబా ఆలయం నుంచి తీసుకువచ్చి తీర్థప్రసాదాలను సభ్యులు ఎమ్మెల్యేకు అందజేశారు. సాయిబాబా చిత్రపటాన్ని అందించారు. ఆలయ చైర్మన్ ఆవునూరి దుర్గయ్య, సభ్యులు కుంబాల రాజేష్, దత్తు, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

రాసం సవితకు డాక్టరేట్



మంచిర్యాలటౌన్: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ విభాగాధిపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్న లెక్చరర్ రాసం సవిత డాక్టరేట్‌ను పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ద్వారా »సింథసిస్ అండ్ బయోలాజికల్ ఎవల్యూషన్ ఆఫ్ నోవెల్ హిటిరోసైక్లిక్ ట్రయాజోల్ అండ్ ఐసోగ్జాజోల్ డెరివేటివ్స్« అనే అంశంపై పి.యాదగిరిస్వామి పర్యవేక్షణలో డాక్టరేట్ పొందినట్లు సవిత తెలిపారు. ఈ సందర్భంగా సవితను కళాశాల ప్రిన్సిపాల్ డి.సుమతి, వైస్ ప్రిన్సిపాల్ కె.శివలీల, తోటి సిబ్బంది శుక్రవారం అభినందించారు.

ప్రయోగాలతో బోధన చేయాలి



ప్రయోగాలు చేస్తున్న సైన్స్ ఉపాధ్యాయులు

దండేపల్లి: సైన్స్ పాఠాలను ప్రయోగాల ద్వారా బోధిస్తేనే విద్యార్థులకు సులభంగా అర్థం కావడంతోపాటు గుర్తుంచుకుంటారని దండేపల్లి కాంప్లెక్స్ హెచ్ఎం శంకర్‌గౌడ్ అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో దండేపల్లి, జన్నారం, లక్సెట్టిపేట, మండలాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు శుక్రవారం కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయులు పలు ప్రయోగాలు నిర్వహించారు. ఉన్నతి లక్ష్యాల ఆధారంగా పీరియడ్, వార్షిక ప్రణాళికలు రాస్తూ ప్రతి పాఠ్యాంశం ప్రయోగాల ద్వారా విద్యార్థులకు బోధించాలన్నారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న ఈశ్వరిబాయి

జన్నారం: మండలంలోని మారుమూల రాయికుంట గ్రామంలోని గిరిజనులకు మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి ఆధ్వర్యంలో శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. 20 మంది నిరుపేద కుటుంబాలకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఈశ్వరిబాయి మాట్లాడుతూ చలి తీవ్రత నేపథ్యంలో రోజురోజుకు పెరుగుతున్నందున నిరుపేద గిరిజనులకు దుప్పట్లు అందించినట్లు తెలిపారు. రాంజీగోండ్ ఆశయసాధన సమితి చైర్మన్ తిరుపతి, దేవునిగూడ మాజీ సర్పంచ్ సుధాకర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఆరు గ్యారంటీలు

- బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్

వేమనపల్లి: అర్హులందరికీ ఆరు గ్యారంటీల పథకాలు అందిస్తామని బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. అనంతరం దస్నాపూర్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీపీ స్వర్ణలత, జెడ్పీటీసీ ఆర్.స్వర్ణలత, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో లక్ష్మయ్య, వైస్ ఎంపీపీ గణపతి, సర్పంచులు మధుకర్ రాజేశ్వరి, మధు, బాపు, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్, కోఆప్షన్ సభ్యుడు జాహెద్‌ఆలీ పాల్గొన్నారు.

దండేపల్లి: ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలకు ప్రజాపాలన పేరుతో స్వీకరిస్తున్న దరఖాస్తులకు, దరఖాస్తుదారుని ఆధార్, కుటుంబ రేషన్ కార్డు ఉంటే సరిపోతుందని మంచిర్యాల ఆర్డీవో రాములు అన్నారు. మండలంలోని పెద్దపేటలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. చాలాచోట్ల ప్రజలు దరఖాస్తుకు, అన్ని జతచేయాలంటూ జిరాక్స్‌సెంటర్లకు పరుగెత్తి, డబ్బులు, సమయం వృథా చేసుకుంటున్నారని పేర్కొన్నారు. దరఖాస్తులో అన్ని వివరాలు రాయాలన్నారు. అనంతరం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, తహసీల్దార్ సంధ్యరాణి, జెడ్పీటీసీ గడ్డం నాగరాణి, సర్పంచ్ జాడి మాధవి, అధికారులు పాల్గొన్నారు.

ఓవైపు దరఖాస్తుల స్వీకరణ..మరోవైపు ఆన్‌లైన్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఆరు గ్యారంటీ పథకాల కోసం చేపడుతున్న ప్రజాపాలనలో భాగంగా ఓ వైపు అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుండగా మరోవైపు దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభమైంది. శుక్రవారం హాజీపూర్ మండలం 17 గ్రామాల వ్యాప్తంగా చేపడుతున్న ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ శనివారంతో ముగియనుంది. ఈ క్రమంలో కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయంలో అభయహస్తం దరఖాస్తు ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభించగా వేగవంతంగా సాగుతోంది. మండలంలో మొత్తంగా 9,318 నివాస గృహాలు



మంచిర్యాలలో దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బంది



వేమనపల్లి: కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వినోద్

ఉండగా ఇప్పటివరకు మొత్తం 10,880 అభయహస్తం దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో అబ్దుల్‌హై తెలిపారు.

చెన్నూర్‌రూరల్: మండలంలో ప్రజాపాలన కొనసాగుతోంది. శుక్రవారం కత్తెరసాల, కొమ్మెర, నారాయణపూర్, దుగ్నెపల్లి గ్రామాలలో ప్రజాపాలన కొనసాగింది. ముందుగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని అధికారులు చదివి వినిపించిన అనంతరం దరఖాస్తులను స్వీకరించారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అజ్మత్‌అలీ, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

జన్నారం: ప్రజాపాలనలో భాగంగా అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. దరఖాస్తులు ఇచ్చేందుకు గ్రామాల ప్రజలు పోటెత్తారు. కిష్టాపూర్, కవ్వాల్, ధర్మారం, కామన్‌పల్లి గ్రామాల్లో ప్రజలు దరఖాస్తులను స్వీకరించారు. వివిధ పథకాల గురించి, దరఖాస్తులు చేసుకున్నారు. ఎంపీడీవో అరుణరాణి, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీవో



తాండూర్: లబ్ధిదారుల నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

రమేశ్, డీటీ రామ్మోహన్, సర్పంచులు లక్ష్మి, మానస, తార, గంగాధర్, కాంగ్రెస్ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్ పాల్గొన్నారు.

తాండూర్: ఆరు గ్యారంటీలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీటీసీ, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి కోరారు. మండలంలోని నీలాయపల్లిలో శుక్రవారం జరిగిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ గ్రామసభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమన్నారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ట్రాన్స్‌కో ఏఈ ప్రభాకర్ పాల్గొన్నారు.

భీమారం: మంబలంలోని 11 పంచాయతీల్లో ప్రజాపాలనలో వస్తున్న దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే కార్యక్రమాన్ని శుక్రవారం ఎంపీడీవో శ్రీనివాస్ ప్రారంభించారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను పంచాయతీల వారీగా ఆన్‌లైన్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రెండు టీఎంసీలు..90 రోజులు

- గూడెం ఎత్తిపోతల ద్వారా యాసంగికి సాగునీరు
- ఎమ్మెల్యే పీఎస్‌ఆర్ చేతులమీదుగా నేడు నీటి విడుదల

దండేపల్లి: కడెం ప్రాజెక్టు కింద యాసంగి సాగుకు క్రాప్ హాలిడే ప్రకటించినప్పటికీ ఆయకట్టు పరిధిలోని డిస్ట్రిబ్యూటరీ 30వ కాల్వనుంచి డిస్ట్రిబ్యూటరీ 42 వరకు యాసంగి సాగుకు దండేపల్లి మండలంలోని గూడెం గోదావరినది ఒడ్డున గల శ్రీసత్యనారాయణస్వామి ఎత్తిపోతల పథకం నీటిని అందించనున్నారు. ఇందుకు సంబంధించిన నీటిని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు శనివారం విడుదల చేయనున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌ను కడెం ఆయకట్టు పరిధిలోని డీ-30 నుంచి 42 వరకు సాగునీరందించడం కోసం గూడెం గోదావరి ఒడ్డున శ్రీసత్యనారాయణస్వామి ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. గూడెం గోదావరి ఒడ్డు నుంచి దండేపల్లి మండలంలోని తానిమడుగు వద్ద గల డీ-30 వద్ద కడెం ప్రధాన కాల్వలో నీటిని



గూడెం ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్

ఎత్తిపోస్తున్నారు. ఎత్తిపోతల ద్వారా దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాలకు కలిపి మొత్తం 30 వేల ఎకరాలకు సాగునీరందించాల్సి ఉన్నప్పటికీ, నీటి నిల్వల ఆధారంగా ఇప్పటివరకు ఒక్కోసారి 17 వేలు, మరోసారి 24 వేల ఎకరాలకు మాత్రమే సాగునీరందించారు. ఈసారి ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటిమట్టం తక్కువగా ఉన్నందున ఈ యాసంగికి 2 టీఎంసీల నీటిని 90 రోజుల పాటు, కేవలం 15 వేల ఎకరాలకు మాత్రమే సాగునీరందించనున్నట్లు అధికారులు తెలిపారు. రైతులు కూడా వరికి బదులు ఆరుతడి పంటలు మాత్రమే వేసుకుని ఎత్తిపోతల ద్వారా అందించే సాగునీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

పోచమ్మ ఆలయంలో మొక్కులు

చెన్నూర్: పట్టణంలోని మదనం పోచమ్మ ఆలయంలో శుక్రవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ దంపతులు మొక్కులు చెల్లించారు. ఆయనకు ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వినోద్ బెల్లంపల్లి ఎమ్మెల్యేగా గెలుపొందితే అమ్మవారికి మొక్కు చెల్లిస్తామని ఆయన అభిమాని తనుగుల రవికుమార్ మొక్కుకున్నాడు. రవి మొక్కు మేరకు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి మొక్కులు చెల్లించినట్లు ఎమ్మెల్యే వినోద్ తెలిపారు. చెన్నూర్ మదనం పోచమ్మ ప్రజలు



మొక్కు చెల్లిస్తున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే దంపతులు

చల్లగా చూడాలని కోరుకున్నానన్నారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, తనుగుల రవికుమార్ పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

మందమర్రిరూరల్: మండలంలోని ఆదిల్‌పేటలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పొన్నారం కాంప్లెక్స్ హెచ్ఎం దత్తుమూర్తి శుక్రవారం సందర్శించారు. పాఠశాల గదులను పరిశీలించారు. విద్యార్థుల ప్రగతిని తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయురాలు సునీతాదేవి, సీఆర్పీ రాంచందర్ తదితరులు ఉన్నారు.

కొత్త గనుల ఏర్పాటుకు కృషి

శ్రీరాంపూర్: సింగరేణిలో కొత్త భూగర్భ గనుల ఏర్పాటుకు ఐఎన్టీయూసీ కృషి చేస్తుందని ఆ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జట్టి శంకర్‌రావు తెలిపారు. ఆర్కే న్యూటెక్ గనిపై శుక్రవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. తమ యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ కొత్త గనుల ఏర్పాటు కోసం రాష్ట్ర, జాతీయస్థాయి అగ్రనాయకుల ద్వారా ప్రభుత్వాలతో చర్చిస్తున్నారని తెలిపారు. మోదీ సర్కార్ సింగరేణిలో ప్రైవేట్‌పరం చేయనున్న నాలుగు బొగ్గు బ్లాక్‌లు అడ్డుకుంటామన్నారు. దీనికోసం ఐఎన్టీయూసీ ఉద్యమాలు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం నాయకులు నస్పూర్ కాలనీలోని డిస్పెన్సరీని సందర్శించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ఎక్స్‌రే యంత్రాన్ని ఎందుకు వేరే ఏరియాకు తరలిస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. దీన్ని వేరే



మాట్లాడుతున్న శంకర్‌రావు

ప్రాంతానికి తరలించడానికి వీల్లేదని, ఇక్కడే ఎక్కువమంది కార్మికులు ఉన్నందున ఈ ఆసుపత్రిలో అందుబాటులో ఉంచాలని కోరారు. యూనియన్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, డెప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగే స్వామి, జాతీయ సమితి సభ్యులు భీమ్‌రావు, నాయకులు బుస్స రమేశ్, ల్యాగల శ్రీనివాస్, నర్సింగ్, తిరుపతిరెడ్డి, విజయపాల్‌రెడ్డి, సదానందం, రమేశ్ పాల్గొన్నారు.

సీహెచ్‌పీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీసైదా, డెప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం వారు సీహెచ్‌పీని సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికులు వారి ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఉద్యోగుల వృత్తిపరమైన సమస్యలతోపాటు దుమ్ము సమస్య పరిష్కరించాలన్నారు. ఇంకా ఇతర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని కార్మికులకు హామీఇచ్చారు. అనంతరం నూతనంగా గుర్తింపు సంఘంగా ఎన్నికై



ఏఐటీయూసీ నాయకులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

న ఇరువురి నాయకులను మైసమ్మ ఆలయ కమిటీ నాయకులు వారిని సన్మానించారు. ఫిట్ సెక్రటరీలు గునిగంటి నర్సింగరావు, తిరుపతి, సాయిరాజ్ పాల్గొన్నారు.

అమ్మవారి ప్రతిమలకు జలాభిషేకం



అమ్మవారి ప్రతిమలకు జలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

కోటపల్లి: మండలంలోని సుపాకలో మారెమ్మ లక్ష్మీదేవి జాతరలో భాగంగా శుక్రవారం మారెమ్మ లక్ష్మీదేవి అమ్మవారి ప్రతిమలతో గ్రామస్తులు డప్పుచప్పుళ్లతో కాలినడకన ఎర్రాయిపేట గోదావరి నదికి తీసుకువచ్చి గంగస్నానం ఆచరించారు. అమ్మవార్లకు పసుపు కుంకుమలతో సంప్రదాయంగా జలాభిషేకం చేశారు. శనివారం రాగిబోనం, ఆదివారం బోనాల జాతర ఉంటుందని సర్పంచ్ సతీశ్ తెలిపారు.



అమ్మవార్లకు గోదావరిలో పూజలు చేస్తున్న గ్రామస్తులు

సీఎండీని కలిసిన ఏఐటీయూసీ కార్యదర్శి

మందమర్రిరూరల్: సింగరేణి సీఎండీ బలరాంను శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఏఐటీయూసీ మందమర్రి ఏరియా బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఏరియాలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, గతేడాది నుంచి కొందరు కేకే-ఓసీ కార్మికులకు ఇంటి అద్దె చెల్లించని విషయాన్ని ఆయన దృష్టికి తెచ్చారు.



సీఎండీ బలరాంను కలిసిన సత్యనారాయణ

సంక్షిప్త వార్తలు

సౌండ్ సిస్టమ్ అందజేత

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు మంచిర్యాల గర్మిళ్ల శాఖ లయన్స్‌క్లబ్ సభ్యులు రూ.25వేల విలువ గల సౌండ్ సిస్టమ్ అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ సభ్యులకు హెచ్ఎం యోగేశ్వర్ కృతజ్ఞతలు తెలిపారు. క్లబ్ జోనల్ చైర్మన్ రాంచందర్, రమేశ్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నెన్నెల: మండలంలోని గంగారాం గ్రామంలో శుక్రవారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో రూరల్ ఫోక్ అర్ట్స్ ఆర్గనైజేషన్ కళాబృందంతో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. మేనేజర్ సంతోష్,ఫీల్డ్ ఆఫీసర్ అరవింద్, అకౌంటెంట్ అజయ్, క్యాషియర్ నరేశ్ పాల్గొన్నారు.

రచ్చపల్లిలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

చెన్నూర్‌రూరల్: మండలంలోని రచ్చపల్లిలో వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా ప్రచారరథంలోని ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా కేంద్రం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలు వీక్షించారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాలారెడ్డి హాజరై మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఫీల్డ్ అధికారి స్వాతి, బీజేపీ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన పెంపొందించుకోవాలి

తాండూర్: పిల్లలకు అందించే పౌష్టికాహారంపై తల్లులు అవగాహన పెంపొందించుకోవాలని బెల్లంపల్లి సీడీపీవో ఉమాదేవి అన్నారు. మండలంలోని మాదారం త్రీ ఇంక్‌లైన్ అంగన్‌వాడీ కేంద్రంలో సామాజిక వేడుకల్లో భాగంగా చిన్నారులకు శుక్రవారం సామూహిక అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత, సర్పంచ్ సుజాత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరభ్యాసం

మంచిర్యాలటౌన్: జిల్లాకేంద్రంలోని రాజీవ్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం 3లో శుక్రవారం చిన్నారులకు అక్షరభ్యాసం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ రమ పుప్పాల, పోషణ అభియాన్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ రజిత, ఏఎన్ఎం సరిత, ఆర్పీ రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ రేణుక పాల్గొన్నారు.

ఉచిత షుగర్ నిర్ధారణ పరీక్షలు

జన్నారం: మండలంలోని కిష్టాపూర్, జన్నారం పంచాయతీల్లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత షుగర్ నిర్ధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన 224 మందికి షుగర్ పరీక్షలు చేసినట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు శెట్టి రాజశేఖర్ తెలిపారు. ప్రధాన కార్యదర్శి రాజేందర్, కోశాధికారి సురేశ్ పాల్గొన్నారు.

ఉద్యమకారులందరికీ అందించాలి

దండేపల్లి: కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఉద్యమకారులకు 250 గజాల ఇంటిస్థలాన్ని అర్హులందరికీ అందించాలని దండేపల్లి మండలం వెంకటాపూర్‌కు చెందిన మలిదశ ఉద్యమకారుడు పిట్టల తిరుపతి డిమాండ్ చేశారు. ప్రజాపాలనలో భాగంగా శుక్రవారం ఆయన ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకున్న అనంతరం మాట్లాడారు. ఉద్యమకారులంటే కేసులు నమోదు కావడం, పైగా ఎఫ్ఐఆర్ అయి ఉండాలనే నిబంధనలు ఎత్తివేసి, శాంతియుతంగా ఉద్యమంలో పాల్గొన్నవారికి పథకాలు అందించాలని కోరారు.

కస్తూర్బా పాఠశాల సందర్శన

జైపూర్: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను డీఈవో యాదయ్య శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. స్పెషల్ ఆఫీసర్ ఫణిబాల ఉన్నారు.

లక్ష్మీ అమ్మవారు ఆగమనం

చెన్నూర్: పట్టణానికి లక్ష్మీదేవర చేరుకుంది. అమ్మవారికి మేళతాళాలు మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. పట్టణంలోని బట్టిగూడెం కాలనీకి చెందిన లక్ష్మీదేవర ప్రతీ ఐదేళ్లకు ఒక్కసారి తండ్రి కొలువై ఉన్న గోలేటిలో భీమన్న ఆలయానికి వెళ్లడం ఆనవాయితీగా వస్తుంది. గతనెల మొదటి వారంలో అమ్మవారిని భక్తులు కాలినడక తీసుకుని వెళ్లారు. గోలేటి భీమన్న దర్శనం అనంతరం అక్కడి నుంచి అమ్మవారిని పాదయాత్రతో తీసుకువచ్చారు. శుక్రవారం అమ్మవారి చెన్నూర్‌లో ఆగమనం అయింది. రాత్రి ఆలయ ప్రాంగణంలో ఆట పాటలు నిర్వహిస్తామని నిర్వాహకుడు గిరెల్లి మల్లయ్య తెలిపారు. వచ్చేనెల మొదటి వారంలో అమ్మవారి బోనాల జాతర ఉంటుందన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన

జైపూర్: మహిళా శిశుసంక్షేమశాఖ ఆదేశాల మేరకు మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రితోపాటు కుందారం ఆస్పత్రి, ప్రభుత్వ పాఠశాలలో మహిళా సాధికారతపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత హబ్ జిల్లా కోఆర్డినేటర్ సౌజన్య, స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్సియల్ లిటరసీ లిప్సిక ఆధ్వర్యంలో పలు అంశాల గురించి వివరించారు. వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

నెన్నెల: రోడ్డు ప్రమాదంలో కాళ్లు, వెన్నెముక విరిగిన ఓ నిరుపేద యువకుడి కుటుంబానికి నెన్నెల కోవిడ్ వాలంటరీస్ బృందం, జైపూర్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు శుక్రవారం రూ.21 వేల ఆర్థికసాయం అందజేశారు. నెన్నెల మండలం చిత్తాపూర్‌కు చెందిన ఈగం భీమక్క, భీమయ్య దంపతుల కుమారుడు కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న కోవిడ్ వాలంటరీస్ బృంద వ్యవస్థాపకుడు, ఉపాధ్యాయుడు జలంపల్లి శ్రీనివాస్ గ్రూపు సభ్యుల ద్వారా సేకరించిన నగదును యువకుడి చికిత్స కోసం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

బీసీలకు పార్లమెంట్ స్థానాలు కేటాయించాలి

పాతమంచిర్యాల: పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు 9 స్థానాలు కేటాయించాలని బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని జన్మభూమినగర్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో మూడు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు బీసీలకు జనాభా ప్రాతిపదికన ఎంపీ సీట్లు కేటాయించాలన్నారు. రాష్ట్రంలో 17 పార్లమెంట్ స్థానాలు ఉండగా, బీసీలకు జనాభా ప్రాతిపతికన ఏ రాజకీయ పార్టీ ప్రాధాన్యత కల్పించలేదన్నారు. నాయకులు గజెల్లి వెంకటయ్య, జైపాల్‌సింగ్, మహేశ్ పాల్గొన్నారు.

శ్రీరాముడి అక్షింతలు పంపిణీ

రామకృష్ణాపూర్: శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య రాముడి అక్షింతలను శుక్రవారం పట్టణంలోని శ్రీకోదండ రామాలయంలో పంపిణీ చేశారు. అర్చకులు అంబాప్రసాద్‌తో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం సీతారామచంద్ర మూర్తుల ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తూ ఇంటింటా అక్షింతలను అందజేశారు.

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో శుక్రవారం అయోధ్య శ్రీరాముని అక్షింతల పంపిణీ చేశారు. అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ అక్షింతలను ఇంటింటికి వెళ్లి బెల్లంపల్లి ట్రస్ట్ సభ్యులు అందజేశారు. మున్సిపల్ 1 వార్డు కౌన్సిలర్ సూరం సంగీత, బెల్లంపల్లి ట్రస్ట్ సభ్యురాలు జాగటి కల్పన, మహిళలు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: పట్టణంలోని అయోధ్య రాములోరి అక్షింతల శోభాయాత్ర నిర్వహించారు. పాలచెట్టు వద్ద గల శ్రీ పంచముఖి అంజనేయస్వామి ఆలయం వద్ద ప్రారంభమైన శోభాయాత్ర కార్మెల్ స్కూల్, పోలీస్‌స్టేషన్, పోస్టాఫీస్, శ్రీ వేంకటేశ్వర ఆలయం కోల్‌బెల్ట్ రహదారి మీదుగా మార్కెట్ చేరుకుంది. శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ పంచముఖి ఆంజనేయస్వామి, సాయిబాబా ఆలయాల అర్చకులు గోవర్ధనగిరి అనంతాచార్యులు, కృష్ణకాంతాచార్యులు, నరిసింహాచార్యులు, ఆలయాల కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



రామకృష్ణాపూర్: అక్షింతలతో భక్తులు

భీమారం: మండల కేంద్రంలోని ఐటీడీఏకాలనీలో శుక్రవారం రాములోరి అక్షింతలను ఇంటింటికీ అందజేశారు. ఈ అక్షింతలు తీసుకవస్తున్న బృందానికి కాలనీవాసులు మంగళహారతులతో స్వాగతం పలికారు. కాగా, అక్షింతలను ప్రతి ఇంటికి అందజేస్తామని భక్తులు తెలిపారు.

శాంతిఖని ఉద్యోగులకు వైద్యపరీక్షలు

బెల్లంపల్లి: మందమర్రి ఏరియా శాంతిగనిలో పనిచేస్తున్న ఉద్యోగులకు శుక్రవారం వైద్యపరీక్షలు జరిగాయి. రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రి ఆధ్వర్యంలో గని ఆవరణలో ఏర్పాటు చేసిన క్యాంపులో ఉద్యోగులను వైద్యులు పరీక్షించారు. కొందరిని బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రికి రెఫర్ చేశారు. గని యాక్టింగ్ మేనేజర్ రాజు, ఫిట్ ఇంజినీర్ రాంబాబు, బోల్టర్ మైనర్ ఇన్‌చార్జి ముస్తాఫా, వెంటిలేషన్ అధికారి పూర్ణచందర్, ఇంజినీర్లు రాంసాగర్, ప్రవీణ్, గని సంక్షేమ అధికారి సత్యనారాయణ, ఏఐటీయూసీ ఫిట్‌సెక్రెటరి తిరుపతిగౌడ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

నెన్నెల: మండలంలోని గంగారాంలో ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, డయల్ 100పై గ్రామస్తులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ సైబర్‌నేరాల పట్ల ప్రజలు, విద్యార్థులు, యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. సర్పంచ్ సుధ, మహిళలు, యువకులు పాల్గొన్నారు.